
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 20 | జూలై | 2023



నైపుణ్యాభివృద్ధికి తర్ఫీదు

నవీన విద్యావిధానంలో జీవన నైపుణ్యాల శిక్షణను పాఠ్యాంశాలుగా చేర్చాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. 8లో▸



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,200, మధ్యడెల్టాకు 2,600,పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాలికపై లైంగిక దాడి యత్నం కేసులో ఐదేళ్ల జైలు



ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పుచెప్పారు. 8లో▸

న్యూస్‌రీల్

బాధితులకు అండగా ఉంటా



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు తమ గోడు వెళ్ల బోసుకుంటున్న బాధితులు

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం తొత్తరమూడిలోని అర్చక భూముల్లో నివాసం ఉంటున్న 50 కుటుంబాల వారికి అండగా ఉంటానని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు భరోసా ఇచ్చారు. బాధితులు అమలాపురంలోని ఎమ్మెల్సీ కార్యాలయానికి బుధవారం వచ్చి తమ గోడును చెప్పుకున్నారు. సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఆ భూముల్లో ప్రభుత్వపరంగా పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. తొత్తరమూడి అర్చక భూముల్లో నివాసం ఉంటున్న ఆ 50 కుటుంబాల వారిని తక్షణమే ఇళ్లు ఖాళీ చేయాలని ఆలయ ఈవో తదితరులు ఒత్తిడి చేయడం సరికాదని ఆయన అన్నారు. ఇప్పటికే తనతోపాటు బాధితులు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి న్యాయం కోరినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



హసన్‌బాద గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర బుధవారం ద్రాక్షారామ పరిధిలోని హసన్‌బాద, తాళ్లపొలం గ్రామ సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయా సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ సేవలకు సంబంధించిన రికార్డులను, ఆన్‌లైన్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భవతులకు, శిశువులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా టీం ఎంపీహెచ్‌ఈఓలు రామకృష్ణ, రవికుమార్, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.ప్రశాంతి, సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సీహెచ్‌ఓ జె.సింధు, ఏఎన్‌ఎంలు జి.వెంకటరమణ, కె.గాయత్రి, ఆశాలు పాల్గొన్నారు.

జిల్లాలో 37.8 మిల్లీమీటర్ల వర్షం

అమలాపురం రూరల్: ఒడిశాను ఆనుకుని కొనసాగుతున్న ఆవర్తనం రానున్న 48 గంటల్లో అల్పపీడనంగా ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. జిల్లాలో రెండురోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు కురవనున్నాయి. ఒడిశాను ఆనుకుని కొనసాగుతున్న ఆవర్తనం ప్రభవంతో తాజాగా బుధవారం ఒక మోస్తరు వర్షం పడింది. మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లాలో సగటున 2.9 మి.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 37.8 మి.మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా కొత్తపేటలో 15.2 మీ.మీటర్లు, అత్యల్పంగా మామిడికుదురులో 0.6 మీ.మీటర్లు, మలికిపురం మండలంలో 0.2 మి.మీటర్ల వర్షం కురిసింది. ఆత్రేయపురం 7.0 మి.మీటర్లు, రాయవరంలో 6.6 మి.మీటర్లు, రామచంద్రపురం 6.4, అయినవిల్లి 4.4, మండపేట 4.2 మి.మీటర్లు, రావులపాలెంలో 4.2, ఆలమూరు 4.4, కపిలేశ్వరపురం 2.2, అంబాజీపేటలో 2.2 మిల్లీమీటర్ల వర్షం పడింది.

నలుగురికి కారుణ్య నియామక పత్రాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన నలుగురు ఉద్యోగుల కుటుంబీకులకు బుధవారం కలెక్టర్ కృతికా శుక్లా ఆఫీస్ సబార్డినేట్లుగా కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. రోస్టర్, సీనియారిటీ ప్రకారం పోస్టింగ్స్ ఇస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై వాకబు

- ఇంటింటా హెల్త్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది
- బీపీ, సుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు
- రెండేళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు
- జిల్లాలో 86.73 శాతం పూర్తి



హెల్త్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

రాయవరం: దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నంబర్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఆధార్ నంబర్ ఆధారంగా ప్రతి పౌరుడి వివరాలు నిక్షిప్తం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రతి పౌరుడికి హెల్త్ అకౌంట్‌ను ప్రారంభిస్తోంది. దీనికోసం ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీని కేటాయిస్తోంది. ఆధార్ నంబర్‌తో లింక్ అయిన ఫోన్‌కు ఐడీ నంబరును అందజేస్తోంది. ఈ హెల్త్ ఐడీ ద్వారా దేశంలో ఎక్కడైనా వైద్య సేవలు పొందే అవకాశముంది. దీనికోసం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చక చకా సర్వే చేపడుతున్నారు. రెండేళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను వైద్య సిబ్బంది సర్వే ద్వారా నమోదు చేస్తున్నారు.

ప్రతి పౌరుడికి హెల్త్ ఐడీ

సాధారణంగా వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లగానే వైద్యుడు బీపీ, సుగర్ వంటి పరీక్షలు చేస్తారు. మనం చెప్పే ఆరోగ్య పరిస్థితిని బట్టి మన వద్ద రిపోర్టులున్నాయా? అని వైద్యులు అడుగుతారు. మనం తీసుకుని వెళ్లడం మర్చిపోయినా, పోగొట్టుకున్నా, మళ్లీ కొత్తగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. తరచుగా వెళ్లే వైద్యుడైతే మనల్ని చూడగానే చాలా వరకు మన ఆరోగ్య వివరాలను చెప్పగలడు. వేరే వైద్యుడి వద్దకు వెళ్లాల్సి వస్తే అప్పుడు తప్పనిసరిగా ముందు చేయించుకున్న టెస్ట్ రిపోర్టులు అడుగుతారు. లేకుంటే మళ్లీ పరీక్షలు మళ్లీ చేయించుకోవాల్సి వస్తోంది. ఇటువంటి వ్యయప్రయాసలకు చెక్ పెట్టి, రోగులకు సులభంగా వైద్యం అందించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఐడీ నంబర్‌ను కేటాయిస్తోంది. దీని వల్ల వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లగానే బీపీ, సుగర్, గుండె జబ్బులు, ఇతర క్రానికల్ డిసీజెస్ ఏమున్నా వైద్యులకు తెలుస్తోంది. అయితే పేషెంట్ అనుమతితో, అతని బయోమెట్రిక్ అథంటికేషన్ ద్వారా మాత్రమే అతని వివరాలు తెలుసుకునే వీలుంటుంది. పేషెంట్ నిరాకరిస్తే వివరాలు తెలుసుకోలేరు.

సర్వే చేపడుతున్నారిలా..

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)లో భాగంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకునేందుకు సర్వే చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యులతో కూడిన బృందాలు ప్రతి ఇంటిని సర్వే చేస్తున్నాయి. రెండేళ్ల వయస్సు పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నాయి. ఒక వ్యక్తికి సంబంధించి..రక్తపోటు, చక్కెర, థైరాయిడ్, ఆస్తమా, గండెజబ్బులు, క్యాన్సర్, నరాల సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు (అసంక్రమిత వ్యాధులు) వివరాలను సేకరిస్తున్నారు. క్షయ, లెప్రసీ, గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నా, మలేరియా, టైఫాయిడ్, కోవిడ్ వంటి వ్యాధులు, నడుంనొప్పి, చర్మ సంబంధిత, రోడ్డు ప్రమాదంలో గాయపడినప్పుడు, ఎముకల సంబంధిత వ్యాధులకు ఎప్పుడైనా శస్త్ర చికిత్సలు జరిగితే వాటి వివరాలు సైతం ఆ వ్యక్తి ఐడీ నంబర్‌లో పొందుపరుస్తున్నారు. హెల్త్ ఐడీ ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు(ఈహెచ్‌ఆర్)లో ప్రజల ఆరోగ్య వివరాలు నిక్షిప్తమై ఉంటాయి.

ఈ వివరాలు తెలుసుకుంటారు

సర్వే చేసేటప్పుడు వ్యక్తి పేరు, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు, చిరునామా, వయస్సు, ఆ వ్యక్తికి ఉన్న వ్యాధుల వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య చరిత్ర వైద్య ఆరోగ్యశాఖకు తెలియడం వలన వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఐడీ నంబర్ ఉండడం వల్ల దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ చికిత్స సులభంగా చేయించుకోవచ్చు. ఐడీ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే సంబంధిత వైద్యునికి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 17,24,093 మందిని ఎన్‌సీడీ సర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 14,62,849 మందికి (86.73 శాతం) సర్వే పూర్తి చేశారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి 9,43,799 మందికి హెల్త్ ఐడీలు జారీ చేశారు. వీరిలో 1,62,578 మంది హైపర్ టెన్షన్, 1,06,217 మంది డయాబెటీస్‌తో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. బీపీ, సుగర్ కలిగి ఉన్నట్టు 69,938 మందిని గుర్తించగా, రోగులు చెప్పిన వారి ఆరోగ్య పరిస్థితి ప్రకారం హైపర్ టెన్షన్ రిస్క్ గ్రూపులో 1,11,451, డయాబెటీస్ రిస్క్ గ్రూపులో 1,47,412 మంది ఉన్నట్లుగా గుర్తించారు.

త్వరలో శతశాతం



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వే చురుగ్గా చేపడుతున్నాం. ఇప్పటి వరకు 86.73 శాతం మందికి హెల్త్ ఐడీలు క్రియేట్ చేశాం. మిగిలిన 13 శాతం పూర్తి చేసే పనిలో హెల్త్ సిబ్బంది నిమగ్నమయ్యారు. త్వరలోనే 100 శాతం సర్వే పూర్తి చేసే పనిలో ఉన్నాం.

– డాక్టర్ జాన్ లెవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, ఎన్‌సీడీ అండ్ ఆర్‌బీఎస్‌కే, అమలాపురం

గోదావరి వరదపై అప్రమత్తం

సాక్షి అమలాపురం: ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద వరద నీరు భారీగా చేరుతోందని, రాబోయే మూడు రోజుల్లో సుమారు ఐదు లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 1.90 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం వరద ముందస్తు చర్యలలో భాగంగా అన్ని జాగ్రత్తలూ తీసుకుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నంబరు 18004252532 అని తెలిపారు. ఆలమూరు మండలం బడిగువానిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, కేదారిలంక, పాలేపులంక, కె.గంగవరం మండలం శేరిలంక, కోటిపల్లి, పి.గన్నవరం మండలం జి.పెదపూడిలో ఎనిమిది బోట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ శుక్లా వివరించారు.

15 నుంచి పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు



డీపీవో కృష్ణకుమారి

అమలాపురం రూరల్: పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారిణి వి.కృష్ణకుమారి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి నగదు రహిత లావాదేవీల నిర్వహణకు పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బుధవారం జిల్లాలోని డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించవలసిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, గ్రామ ముఖ్య కూడళ్లలో నగదు రహిత లావాదేవీలకు సంబంధించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీవో కృష్ణకుమారి ఆదేశించారు.

ప్రజల ముగింటకు ప్రభుత్వ సేవలు



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాన్ని అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిట్లో ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, దీనికి అద్భుతమైన స్పందన వస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి వేణు పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో గల 1,650 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ ఇప్పటివరకు మున్సిపాలిటీలోని మూడు సచివాలయాల పరిధిలో 10,400 ధ్రువీకరణ పత్రాలను అందజేశామని మంత్రి వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే వచ్చి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎటువంటి రుసుములు తీసుకోకుండా దరఖాస్తు పెట్టుకున్న వెంటనే సచివాలయంలో అందించే విధంగా జగనన్న సురక్ష పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా కావాల్సిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని చెప్పారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కుడిపూడి లలితాగణేష్, పెంటపాటి దేవి శ్రీనివాస్, కేతా శ్రీను, ఎం.సీతారామలక్ష్మి, కొండేపూడి సూర్యకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కె.బాబూరావు, కొండేపూడి సురేష్ పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి అమలాపురం: జిల్లాలో కొబ్బరి విలువ ఆధారిత సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో ఏర్పాటు చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వివిధ శాఖలకు చెందిన అధికారులు, బ్యాంకర్లను కోరారు. కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపన ద్వారా ఒకే జిల్లా – ఒకే ఉత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు ద్వారా కొబ్బరికి లాభసాటి ధర వచ్చేలా చూడాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారు సంస్థలను పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటులో భాగస్వాములైన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్జిన్ కోకోనట్ ఆయిల్, కొబ్బరి బర్ఫీ, లడ్డు, బిస్కెట్, చిప్స్ తదితర ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల విభాగం అధికారులు, నాబార్డ్, డీఆర్‌డీఏ, ఎల్‌డీఎంలు సహకరించాలన్నారు. జిల్లాలో ఒకటి, రెండు భారీ పరిశ్రమలను సైతం ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ శుక్లా కోరారు. సీడీబీ డైరెక్టర్ కుమార్ వేలు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం అధికారి మారుతి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం ప్రసాద్, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, జిల్లా ఉద్యాన అధికారి డీవీ రమణ పాల్గొన్నారు.




రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ విధివిధానాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, మార్పులకు సంబంధించిన డేటా పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తామని, జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఇంటింటి సర్వేలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ పార్టీల తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం వహించాలన్నారు. దీనివల్ల ఓటరు జాబితా మరింత కచ్చితత్వంతో రూపొందుతుందని అన్నారు. ఆగస్టు 22 తర్వాత రాజకీయ పార్టీల సూచనలు, ఆమోదం మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ నిర్వహిస్తామన్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేసి అక్టోబర్ 17న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్‌ను ప్రచురిస్తామని తెలిపారు. తదుపరి నవంబర్ 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు సమయం ఉంటుందని, ఓటర్ల నమోదుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచనలకు అనుగుణంగా ప్రత్యేక ఓటర్ నమోదు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, బీజేపీ నాయకులు విశ్వ దొరబాబు, సీపీఎం కె.సత్తిబాబు, వివిధ పార్టీ నాయకులు వడ్డే నాగేశ్వరరావు, మోకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోర్సు ఎంపిక కీలకం



- ప్రారంభమైన ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్
- ఇంజినీరింగ్, వ్యవసాయ కోర్సుల షెడ్యూల్ విడుదల
- హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్,అగ్రికల్చరల్ కళాశాలల్లో చేరికకు హడావుడి మొదలైంది. ఈ కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టు నెలాఖరున ప్రారంభించగా ఈ ఏడాది ముందుగానే విద్యాసంవత్సరం క్రమబద్ధంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంది. ఆగస్టు 16 నుంచి తరగతులు నిర్వహించే దిశగా అడుగులేస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ఉన్నత విద్యామండలి ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల సంఖ్య, కోర్సులు తదితర వివరాలను సేకరించింది.

24 నుంచి ఎంపిక ప్రక్రియ

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలో, ఏ కళాశాలలో చేరాలో వంటి అంశాలపై విద్యార్థులు అవగాహనకు వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 27 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 14,770, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, నన్నయ వర్సిటీ, జేఎన్‌టీయూకేలో 950 సీట్ల వరకూ ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగంలో 12,465 మంది,అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో 4,943 మంది అర్హత సాధించారు. **వెబ్ ఆప్షన్ల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆచితూచి జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.**

మరిన్ని కొత్త బ్రాంచ్‌లు

ఈసీఈ, మెకానికల్, ఈఈఈ ,సీఎస్‌ఈ, సివిల్ వంటి సంప్రదాయ కోర్సులతో పాటు గతేడాది నుంచి పలు కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. సీఎస్‌ఈలో ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్,సైబర్ సెక్యూరిటీ, వీఎల్‌ఎస్‌ఐ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, అగ్రికల్చరల్, మెరైన్, మైనింగ్, స్కిల్అండ్ టెక్స్‌టైల్ వంటి కొత్త బ్రాంచ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా...

cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈఏపీసెట్–23 అడ్మిషన్స్‌పై క్లిక్ చేయాలి.

- వచ్చిన ఫారంతో హాల్‌టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్మిట్ కొట్టాలి.
- పదవ తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల జాబితా, 6నుంచి ఇంటర్మీడియెట్ వరకు స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ర్యాంక్ కార్డు, హాల్‌టికెట్, రేషన్‌కార్డుల జిరాక్స్ అప్‌లోడ్ చేయాలి.
- గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం గలవారికి 10శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.
- ఈ నెల 24నుంచి ఆగస్టు 3వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు.
- ఈ నెల 25 నుంచి 4 వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్.
- ఆగస్టు 3నుంచి 8వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ల ఎంపిక. 9న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం
- 12న సీట్ల కేటాయింపు
- 13,14 తేదీల్లో రిపోర్టింగ్
- 16 నుంచి తరగతులు ప్రారంభం

హెల్ప్‌లైన్ కేంద్రాలు

జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బ్లాక్, ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాల (జగన్నాథపురం) హెల్ప్‌లైన్ కేంద్రాలుగా ఉన్నాయి.

జాగ్రత్తలు పాటించాలి



రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక సమయంలో విద్యార్థి స్వయంగా దగ్గర ఉండి చూసుకోవాలి. స్నేహితులో లేదా మరొకరి ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసుకున్న సందర్భాల్లో కొన్ని తప్పులకు అవకాశం ఉంది. విద్యార్థి అభీష్టం మేరకూ కొన్ని ప్రైవేట్ కళాశాల సిబ్బంది కళాశాల,ఆప్షన్,కోర్సు ఎంపిక చేస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థి అన్నీ తనిఖీ చేసుకోవాలి. మొదటి దశ కీలకం. ర్యాంకును బట్టి మంచి కళాశాలను ఎంపిక చేసుకోవాలి.

– సీహెచ్ సాయిబాబు, డైరెక్టర్(అకడమిక్ ఆడిట్) జేఎన్‌టీయూకే

కళాశాలలకు ప్రాధాన్యం



విద్యార్థులు తొలుత కళాశాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఒకే కోర్సు అనే భావం నుంచి బయట పడాలి. బయట పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు, భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకోవాలి. మూసగా అందరూ ఒకే కోర్సు అనుకుంటూ ఎంపిక చేసుకోవడం ఏమాత్రం సరికాదు. గత రెండేళ్లలో కోవిడ్ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్‌కు డిమాండ్ ఏర్పడింది. తద్వారా సీఎస్‌ఈ కోర్సు ఒకటే ప్రాముఖ్యం కాదని గుర్తించాలి. అభివృద్ధి ఒక రంగంతోనే సాధ్యపడదు. ఆసక్తి ఉన్న బ్రాంచిని ఎంచుకుని ప్రతిభ చూపాలి.

– డాక్టర్ జీవీఆర్‌ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

క్లుప్తంగా

ఎన్డీఏ కూటమిని గద్దె దించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



మాట్లాడుతున్న సీపీఐ నేత అక్కినేని వనజ

ప్రకాశంనగర్ : మతోన్మాదం కుల ప్రాంతీయ వాదాలతో దేశ ప్రజలను విభజించి పాలిస్తున్న ఎన్డీఏ కూటమిని గద్దె దించాలని, అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన ప్రజాస్వామ్య కూటమి ఇండియాను ప్రతి ఒక్కరూ బలపరచాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా స్థాయి, శాఖ కార్యదర్శుల రెండు రోజుల వర్క్‌షాప్‌ను వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశంలో ఉన్న 28 రాజకీయ పార్టీలు ఏకమై ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా ఏర్పడ్డాయన్నారు. దేశంలో మహిళలు, దళితులు, గిరిజనులు కాశ్మీర్ పండితులపై పెరుగుతున్న నేరాలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు ప్రతిపక్షాలన్నీ కలిశాయని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షత వహించగా, సహాయ కార్యదర్శి రేఖ భాస్కర్‌రావు, నగర కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి యత్నం కేసులో ఐదేళ్ల జైలు

అమలాపురం రూరల్: ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించిన అభియోగం రుజువు కావడంతో అమలాపురం రూరల్ మండలం తాండవపల్లికి చెందిన గుత్తాల సువర్ణరాజుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో చట్టం కేసుల ప్రత్యేక జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పుచెప్పారు. ఈ కేసు వివరాలను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ప్రకటనలో వివరించారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని తాండవపల్లిలో 2022 మే ఒకటో తేదీన ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల గుత్తాల సువర్ణరాజు లైంగిక దాడికి యత్నించాడన్నది అభియోగం. అప్పట్లో బాలిక అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదైంది. కాకినాడ కోర్టులో బుధవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ పి.శ్రీనివాసరావు వాదించారు. దర్యాప్తు చేసిన సీఐ వీరబాబు, ఎస్సై పరదేశి, హెచ్‌సీ కె.సుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

నైపుణ్యాభివృద్ధికి తర్ఫీదు

- విద్యార్థుల సామర్థ్యం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- తొలిదశ తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని 150 పాఠశాలల్లో అమలు
- 300 మంది వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి



డైట్‌లో జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ జిల్లా వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్/రాయవరం: సమస్య ఏదైనా, ఎంతటి విషమ పరిస్థితి ఎదురైనా స్థిరంగా ఆలోచించి, సొంతంగా ఓ మంచి నిర్ణయాన్ని తీసుకుని ధైర్యంగా అమలు చేసే సామర్థ్యం ప్రతి ఒక్కరిలో ఉండాలి. అలాంటి జీవన నైపుణ్యాలను ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు నేర్చుకుంటే వారు సామాజిక బాధ్యత నెరిగి సంఘంలో ఉత్తమ పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదుగుతారు. ఈ ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవీన విద్యావిధానంలో జీవన నైపుణ్యాల శిక్షణను పాఠ్యాంశాలుగా చేర్చాలని ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచే దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ‘మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్’తో ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ పేద కుటుంబాలకు చెందిన పిల్లలు అత్యధికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మూడేళ్లపాటు జీవన నైపుణ్యాలు, జీవనోపాదులపై తర్ఫీదు ఇవ్వనుంది.

శిక్షణ ఇలా...

తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఒక్కొక్క జిల్లాలో 300 మంది విద్యార్థులున్న 50 ఉన్నత పాఠశాలలను జీవన నైపుణ్యాల శిక్షణకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల నుంచి పీడీ/పీఈటీతో పాటు ఒక యాక్టివ్ టీచర్‌ను ఎంపిక చేసి మూడురోజుల పాటు బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని 6,7,8 తరగతుల విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాల టైంటేబుల్‌లో ఏడాదిలో 28 పిరియడ్‌ల చొప్పున జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులను కేటాయిస్తారు. ఈ శిక్షణలో ప్రధానంగా జ్ఞానాత్మకం, భావాత్మకం, సాంఘిక విషయాలు వంటి 11రకాల జీవన నైపుణ్యాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు.

తొలి విడతగా..

బొమ్మూరులోని డైట్ కళాశాలలో వారం రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ముందుగా తూర్పుగోదావరి జిల్లాలోని 50 పాఠశాలల వ్యాయామోపాధ్యాయులకు, ఉపాధ్యాయులు 100 మందికి, రెండవ విడతలో కాకినాడ జిల్లా, అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 50 పాఠశాలల చొప్పున 200 మందికి శిక్షణ ఇచ్చారు. ఎస్‌సీఈఆర్టీ సౌజన్యంతో మ్యాజిక్ బస్ సంస్థ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు, డైట్ అధ్యాపకులు ఒక్కో జిల్లాకు మూడు రోజుల చొప్పున శిక్షణ తరగతులను నిర్వహించారు.

సంస్థ ద్వారా 2లక్షల మందికి శిక్షణ ఇచ్చాం



1999లో ఢిల్లీలో స్థాపితమైన మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రెండు లక్షల మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఒకేషనల్ కోర్సులపై శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే ఉద్దేశంతో వారి పిల్లలకు ప్రాథమిక విద్య నుంచే వీటిపై శిక్షణ ఇవ్వాలని కోరింది. జాతీయ నవీన విద్యావిధానం ద్వారా భవిష్యత్తులో దీనిని కరిక్యులంగా చేయనుంది. ప్రతి మనిషికి కొన్ని జీవన నైపుణ్యాలు అవసరం..ఆట,పాటల ద్వారా విద్యార్థులను జీవన నైపుణ్యాలను నేర్పిస్తారు.
–డేవిడ్ రేవంత్, సీనియర్ ట్రైనింగ్ మేనేజర్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్

300 మంది వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు..



ఉపాధ్యాయులకు జీవన నైపుణ్యాలపై లోతుగా అవగాహన కల్పించాం. ఇవన్నీ విద్యార్థి భావిజీవితానికి ఎంతో దోహదపడతాయి. మనసులోని చెడు ఆలోచన్లను తుడిచేసి పాజిటివ్ దృక్పథం వైపు పిల్లల్ని నడిపిస్తాయి. ప్రస్తుత కాలంలో ఇలాంటి శిక్షణ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఎంతో అవసరం.
–డాక్టర్ ఎస్‌డీవీ రమణ, ప్రిన్సిపాల్, డైట్, బొమ్మూరు

సీఎం నిర్ణయం అభినందనీయం



ఒక పిల్లవాడిని చిన్ననాటి నుంచే ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దాలో ఈ జీవన నైపుణ్యాలు నేర్పుతాయి. బోధనరంగంలో మా సర్వీసులో ఇంతటి గొప్ప నైపుణ్యాలను పెంపొందించే ప్రభుత్వాన్ని చూడలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం విద్యార్థుల జీవితాల్లో గొప్ప మలుపులకు కారణమవుతుంది. ఉత్తమ పౌరులను సమాజానికి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం.
– గారపాటి శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీహెచ్ఎస్, అమలాపురం

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



సావిత్రి (ఫైల్)

మామిడికుదురు: అప్పనపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ అదే గ్రామానికి చెందిన శేరు సావిత్రి (55) బుధవారం మృతి చెందింది. ఉదయం తోటి కూలీలతో కలసి గ్రామంలో కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుతూ సావిత్రి ఒక్కసారిగా కుప్పకూలిపోయిందని ఉపాధి హామీ పథకం ఏపీఓ మేడిది సీతారామ్ తెలిపారు. ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే సావిత్రి చనిపోయిందన్నారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారు. తమతో రోజూ కలిసి పనిచేసే ఉపాధి కూలీ మృతి చెందడంతో సహచర కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, గెడ్డం వెంకటేశ్వరరావు సావిత్రి మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు.

హత్య కేసులో ఆధారాల కోసం గాలింపు



గ్రామస్తులతో మాట్లాడుతున్న తుని రూరల్, ప్రత్తిపాడు సీఐలు సన్యాసిరావు, కిషోర్‌బాబు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరులో మహిళ హత్య, ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం చేసిన దుండగుల ఆచూకీ, ఆధారాల కోసం గ్రామస్తులతో కలసి పోలీసులు గాలింపు నిర్వహించారు. బుధవారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో తుని రూరల్, ప్రత్తిపాడు సీఐలు ఎ.సన్యాసిరావు, కిషోర్‌బాబు గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబం నుంచి దొంగిలించిన ఫోన్, అనుమానిత పరికరాలు, ఆయుధాలు, తదితరాలు గుర్తిస్తే నేరుగా పట్టుకోకుండా అక్కడ తెల్లరంగు జెండాను ఉంచాలని సూచించారు. గ్రామస్తులకు పోలీసులు తెల్ల రంగు జెండాలను పంపిణీ చేశారు. అనంతరం సామూహికంగా హత్య జరిగిన సమీప ప్రాంత తోటల్లో గాలించారు. ఫోన్, ఇతర అనుమానిత పరికరాలు, ఆయుధాలు లభించలేదని రూరల్ సీఐ సన్యాసిరావు తెలిపారు. ఇద్దరు ఎస్సైల ఆధ్వర్యంలో బిహార్ వెళ్లిన ఆరుగురు పోలీసులు ఇద్దరేసి చొప్పున బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. మరో నాలుగు ప్రత్యేక బృందాలు జిల్లాలో విచారణ చేస్తున్నాయి.

పసలేని ఆరోపణలు.. ఆపై పలాయనం

- రుజువు చేయలేక వెళ్లిపోయిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
- అనపర్తి ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం వద్ద హైడ్రామా
- టీడీపీ నేతల కవ్వింపు చర్యలను తిప్పికొట్టిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

అనపర్తి: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసి తీరా రుజువు చేయమని అడిగితే పలాయనం చిత్తగించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వ్యవహార శైలి విమర్శల పాలైంది.

స్థానిక ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సంబంధించి కోవిడ్ సమయంలో దాతల నుంచి సేకరించిన విరాళాల్లో అవినీతి చోటుచేసుకుందంటూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపణలు చేశారు. వాటిని ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ, పర్యవేక్షణ కమిటీ సభ్యులు తిప్పికొట్టారు. ఆసుపత్రి అభివృద్ధిలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని, దీనిపై ఆధారాలు చూపేందుకు బుధవారం ఆసుపత్రిలో జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. టీడీపీ శ్రేణులతో ఆసుపత్రిలోకి వస్తున్న మాజీ ఎమ్మెల్యేను.. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయన్న ఉద్దేశంతో సీఐ శ్రీనివాస్ ఆసుపత్రి గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో ఆసుపత్రి లోపల ఉన్న దాతలు, కమిటీ సభ్యులు గేటు వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలియడంతో స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నాయి. దీంతో ఆసుపత్రి వద్ద కొంత ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఇరువర్గాలతో చర్చించిన సీఐ అధికార, ప్రతిపక్షాల నుంచి ఐదుగురు చొప్పున ఆసుపత్రిలో చర్చించేందుకు సిద్ధం కావాలని సూచించారు. దీనికి అధికార పార్టీ సభ్యులు అంగీకరించినప్పటికీ ప్రతిపక్షం నుంచి స్పందించలేదు. ఈ క్రమంలో కొంతసేపు హైడ్రామా తరువాత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఘటనా స్థలం వద్దకు చేరుకున్న రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇరువర్గాలు కలవకుండా నిలువరించామని తెలిపారు.

రామకృష్ణారెడ్డి తోక ముడిచారు

ఆసుపత్రి అభివృద్ధి పర్యవేక్షణ కమిటీ విసిరిన సవాల్‌కు బదులివ్వలేకుండా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తోకముడిచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తాను వెంట తీసుకువచ్చిన మందీమార్బలంతో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దాతల నుంచి రూ. 41 లక్షలు విరాళాలుగా వస్తే మాజీ ఎమ్మెల్యే రూ.1.50 కోట్ల అవినీతి జరిగిదంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.3.4 లక్షల నగదు, 15 కాసుల బంగారు నగల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి

పి.గన్నవరం: స్థానిక డీఎస్ పాలెంలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రూ.3.4 లక్షల నగదు, 15 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితుడు రామేశ్వరపు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను డీఎస్ పాలెంలోని అద్దె ఇంట్లో నివశిస్తున్నాడు. అతడు మరొక ప్రాంతంలో కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ.3 లక్షలతో పాటు, భార్య వెంకటలక్ష్మికి చెందిన 15 కాసుల బంగారు నగలను చెక్క డ్రాయర్‌లో పెట్టి తాళం వేసి, తాళం చెవిని ఇంట్లో భద్రపరిచాడు. ఉప్పు డబ్బాలో రూ.40 వేలు దాచాడు. కొత్త ఇంటికి అవసరమైన టైల్సు కొనుగోలు కోసం మంగళవారం సాయంత్రం శ్రీను తన భార్య, కుమారుడు, కోడలితో కలిసి రావులపాలెం వెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు డీఎస్ పాలెంలోని ఇంటికి వచ్చారు. ఇంటి తలుపునకు ఉన్న సెంట్రల్ లాక్ తెరుచుకోక పోవడంతో వెనక్కి వెళ్లే సరికి ఆ తలుపులు తెరచిఉన్నాయి. దొంగలు వీధి తలుపును మారుతాళంతో తీసి లోపలికి వెళ్లి, డ్రాయర్‌లోని నగదు, బంగారు ఆభరణాలను, ఉప్పు డబ్బాలోని నగదును తస్కరించినట్టు బాధితులు గుర్తించారు. సీఐ ప్రశాంత్‌కుమార్ బాధితులతో మాట్లాడారు. వారం రోజుల క్రితం వీధి తలుపు తాళం చెవి కనిపించలేదని, రెండు రోజుల తర్వాత అదే తాళం సింక్‌లో పడి ఉందని బాధితుడు తెలిపాడు. దీంతో తెలిసిన వారెవరైనా చోరీకి పాల్పడ్డారా అనే అనుమానం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి ప్రసాద్ తెలిపారు.

రూ.80 వేల విలువ చేసే ఆభరణాల దోపిడీ

కరప: ఒక ఇంటిలోకి ముసుగు దొంగలు చొరబడి, మహిళను కట్టేసి, రూ.80 వేలు విలువచేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లిపోయిన ఘటన మంగళవారం రాత్రి కరప మండలం నడకుదురులో జరిగింది. కరప పోలీసుస్టేషన్ రైటర్ శ్రీను తెలిపిన వివరాల మేరకు... నడకుదురులోని బృందావనకాలనీకి చెందిన ఉరితి వెంకయ్యమ్మ ఆదేకాలనీలో తనకు తెలిసిన గాడి వినోద్ ఇంటి వద్ద వంటమనిషిగా పనిచేస్తోంది. వినోద్ తన భార్యాపిల్లలు, తల్లితో కలసి మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికెళ్లారు. వెంకయ్యమ్మ తలుపులు వేసుకుని నిద్రించింది. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు ముసుగు దొంగలు ఇంటివెనుక ఉండే గుమ్మం తలుపుల బోల్టుల తప్పించి ఇంటిలోకి చొరబడ్డారు. ముసుగుదొంగలు ఆ మహిళ చేతులు కట్టేసి, రూ.80 వేలు విలువచేసే నాలుగు బంగారు గాజులు, రెండు చెవిదుద్దులు బలవంతంగా లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు కరప ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.